

గ్రీవెన్స్ డేకు 23 ఫిర్యాదులు

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు 23 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.



'చేనేత' విక్రయాలు అంతంతే

సిరిసిల్ల: ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయశాలలో కొనుగోళ్లు అంతంతే సాగాయి. 40 శాతం డిస్కౌంట్ అందించారు.

గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లకల్చరల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశమయ్యారు. జిల్లా జడ్జి ప్రేమలత మాట్లాడుతూ ఈనెల 14న జరిగే లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు లక్ష్మణాచారి, రాధికా జైస్వాల్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు ప్రవీణ్, సృజన, జ్యోతిర్మయి, సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ జయశ్రీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి'



దరఖాస్తు చేస్తున్న వినియోగదారుడు

ముస్తాబాద్/ఇల్లంతకుంట/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట: కరెంట్ సమస్యల సత్వర పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి' నిర్వహిస్తున్నామని ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో సెస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తొలిసారిగా ప్రజావాణి నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ముస్తాబాద్‌లో ఏఈ విష్ణుతేజ, లైన్‌మెన్ శ్రీనివాస్, గౌస్య, హెల్పర్లు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలో జరిగిన కార్యక్రమంలో 9 ఫిర్యాదులు వచ్చాయి. సెస్ ఏఈ నగేశ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బోయినపల్లి మండలంలో సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ ఏఏఈ ప్రశాంత్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు రామస్వామి, లైన్‌మన్ శంకర్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సెస్ ఆఫీస్‌లో డైరెక్టర్ వరుస కృష్ణహరి, సెస్ ఏఈ పృథ్వీధర్‌లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. లూజ్‌వైర్లు, శిథిలావస్థలో ఉన్న స్తంభాలను సరిచేస్తామన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన మత్స్యకారులు

సిరిసిల్లటౌన్: మధ్యమానేరు డ్యామ్‌లో మత్స్య పారిశ్రామిక సంఘం ఏర్పాటు, లైసెన్సు హోల్డర్లు చెల్లించిన డబ్బులు తదితర అంశాల్లోని అవకతవకలు నిగ్గు తేల్చాలని మత్స్యకారులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బి.దేవయ్య, జి.శివకృష్ణ, పి.పర్శరాములు, శ్రీనివాస్, నర్సయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న వంటకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గొట్టె దేవేంద్ర కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రతీ నెల 5వ తేదీలోపునే మెస్‌బిల్లులు, జీతాలు చెల్లించాలని, ప్రమాద బీమా, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సంఘం ప్రతినిధులు జి.పుష్పలత, ఎన్.అంజయ్య, బి.వాణి, భాగ్యలక్ష్మి, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు

సాక్షి ఎఫెక్ట్

- డీఎంహెచ్‌వో వసంతరావు

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని జిల్లా వైద్యాధికారి వసంతరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. 'వైద్య సేవలందేది ఎప్పుడో' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. కోనరావుపేట పీహెచ్‌సీలో 8 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయన్నారు. ధర్మారం, నిజామాబాద్, నిమ్మపల్లి గ్రామాల్లో ఉపకేంద్ర భవనాలకు సొంత భవనాలు ఉన్నాయని, మిగతా ఆరోగ్య ఉపకేంద్రాలకు భవనాల నిర్మాణం పూర్తయిందని, విద్యుత్, నీటివసతి, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించలేదన్నారు. మిగిలిన పనులు పూర్తి చేసిన తర్వాత మండల వైద్యాధికారికి భవనాలు అప్పగించి మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజాపాలన విజయోత్సాహం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సోమవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. సిరిసిల్లలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీ అనంతరం సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కోసి, స్వీట్లు పంచారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ప్రజాపాలన విజయోత్సవాల ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఏఎంసీ చైర్మన్ స్వరూపరెడ్డి, సూర దేవరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.



సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రజా విజయోత్సవ ర్యాలీ

ఘనంగా విజయ్ దివస్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ అరవై ఏళ్ల అన్యాయంపై డిసెంబర్ 9న తెలంగాణ ప్రజలు విజయం సాధించారన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. 11 రోజుల కేసీఆర్ నిరాహార దీక్షతోనే డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును పాస్ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణతల్లి విగ్రహం చేతిలోని బతుకమ్మను తొలగించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, తెలంగాణతల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీల్చేది రోగాలే..

- గాలిలో పడిపోతున్న నాణ్యతా ప్రమాణాలు
- చలి, పొగమంచు, దుమ్ము, ధూళితో సమస్యలు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న వాయు కాలుష్యం
- చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ వ్యాధులు



సాక్షి, పెద్దపల్లి:

వాయు కాలుష్యం పెనుముప్పుగా పరిణమిస్తోంది. పెరుగుతున్న చలి, పొగమంచు, కాలుష్యంతో గాలి నాణ్యత పడిపోతోంది. దుమ్ము, ధూళి కణాలు పెరగడంతో రామగుండం, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో గాలిలో నాణ్యతా ప్రమాణాలు పడిపోతుండడం, పెరుగుతున్న కాలుష్యంతో భవిష్యత్‌లో ఢిల్లీ తరహా పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎండాకాలంతో పోలిస్తే శీతాకాలంలో చాలా తక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ గాలి వేగం కారణంగా పరిసరాల్లో వాయు కాలుష్య ప్రభావం అధికంగా ఉంటుంది.

రెండు చోట్లే నమోదు కేంద్రాలు..

టీపీసీబీ ఆధ్వర్యంలో గోదావరిఖని, కరీంనగర్‌లో మాత్రమే కాలుష్య నమోదు కేంద్రాలున్నాయి. సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తారు. వాయు కాలుష్యాన్ని లెక్కించే యంత్రాలు తక్కువగా ఉండటంతో కచ్చితమైన సమాచారం రావడం లేదని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 2 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వాయు కాలుష్యం క్రమేణా పెరుగుతోంది. థర్మల్ ప్లాంట్స్, ఓపెన్‌కాస్టులు, పరిశ్రమలు, కాలం చెల్లిన వాహనాలు, మట్టి రోడ్లు, డంపింగ్‌యార్డుల్లో చెత్తను కాల్చడం నుంచి వచ్చే దుమ్ము ఇందుకు కారణం.

100–200 మధ్య ఉంటే ప్రమాదం..

ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) 0–50 కేటగిరీలో ఉంటే ఆ గాలి అత్యంత సంతృప్తికరంగా ఉన్నట్లు లెక్క. 51–100 మధ్యలో ఉంటే సంతృప్తికరంగా, 100–200 మధ్య ఉంటే ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. 200 దాటితే ఆరోగ్యానికి హాని అని, వాయు నాణ్యత తగ్గితే చిన్నారులు, వయోవృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా గుండె జబ్బులు, మెదడు భాగానికి రక్త సరఫరా నిలిచిపోవడం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల సమస్య, కేన్సర్, న్యూమోనియా వంటి వ్యాధులు వస్తాయంటున్నారు. వాయు నాణ్యత సూచీలో(ఈ ఏడాది జనవరి) గోదావరిఖని కేంద్రంలో 111, కరీంనగర్ కేంద్రంలో 100గా నమోదైంది. నివారణకు కాలుష్య నియంత్రణ బోర్డు ఎలాంటి చర్యలు చేపట్టట్లేదన్న విమర్శలున్నాయి. కాలుష్య నియంత్రణ అధికారులు వాయు కాలుష్యం అంత ప్రమాదకరస్థాయిలో లేదంటున్నారు.

ఇవి పాటించాలి..

- వ్యర్థాలను కాల్చొద్దు
- ఏసీల అతి వినియోగం వద్దు
- పరిశ్రమల కాలుష్యాన్ని, రోడ్లపై దుమ్ము, ధూళి తగ్గించాలి
- కాలం చెల్లిన వాహనాలను నడిపించొద్దు
- మొక్కలు విరివిగా నాటాలి

ధూళి లెక్కలు ఇలా..

గాలిలో సూక్ష్మ దుమ్ము, ధూళి కణాలను పీఎం(పర్టిక్యులేట్ మేటర్) అంటారు. 10 మైక్రో మీటర్ల కన్నా తక్కువ పరిమాణంలో ఉండే ధూళి కణాలను పీఎం 10గా వ్యవహరిస్తారు. పీఎం 2.5 కంటే పీఎం 10 కణాలు గాలిలో ఎక్కువ సేపు ఉంటాయి. తలవెంట్రుక మందం 50 మైక్రోగ్రాములు ఉంటే పీఎం 10 సైజ్ తలవెంట్రుక కంటే ఐదు రెట్లు తక్కువగా ఉంటుంది. ఇది గాలి ద్వారా ముక్కులోకి, తర్వాత గొంతు ద్వారా శ్వాసకోశాల్లోకి చేరుతుంది. దీనివల్ల గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. రక్షణ పొందాలంటే తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. అయితే, పీఎం 10 స్థాయి ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో గోదావరిఖని కేంద్రంలో(119, 100), కరీంనగర్ కేంద్రంలో(103, 101) 100 మైక్రోగ్రాములు దాటడం ఆందోళన కలిగించేదే. గాలిలో నైట్రోజన్, కార్బన్‌డయాక్సైడ్, సల్ఫర్‌మోనాక్సైడ్ పరిమితులు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తేమ శాతం తగ్గి, కాలుష్య కారకాలు గాలిలో కలిసిపోవడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రభావం ఉంటుందని వైద్యనిపుణులు అంటున్నారు.

చలికాలంలో తీవ్ర ప్రభావం



చలికాలం వాయు కాలుష్య తీవ్రత అధికంగా ఉంటుంది. పిల్లలు, వృద్ధులపై ప్రభావం చూపుతుంది. పరిశ్రమల పొగ, రోడ్లపై లేచే, గనుల నుంచి వెలువడే దుమ్ము, వాహనాల పొగ తదితరాలకు దూరంగా ఉండాలి.

– శ్రీనివాస్, ఛాతి వైద్య నిపుణుడు, గోదావరిఖని

అమలు కావడం లేదు



వాయు నాణ్యత మెరుగు కోసం ఎస్‌జీడీ యూనిట్లు నిర్మించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎక్కడా అమలు కావడం లేదు. ఏక్యూఐలో తప్పుడు సంఖ్యలు చూపిస్తున్నారు. ఇప్పటికైనా పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు కాలుష్యాన్ని నియంత్రించాలి.

– ఉమామహేశ్వర్‌రావు, పర్యావరణవేత్త

ప్రజా'వాణి' వినండి

- వెల్లువెత్తిన దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లు
- సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాక బాధితులు పలువురు కలెక్టరేట్ బాట పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించండని అధికారులను వేడుకుంటున్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విన్నపాలు వెల్లువెత్తాయి. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 56, జిల్లా సంక్షేమాధికారికి 8, విద్యాశాఖకు 7, ఎస్డీసీకి 6, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌కు 5, వ్యవసాయశాఖ, సెస్‌కు 4 చొప్పున, ఉపాధి కల్పన శాఖకు 3, ఏరియా ఆస్పత్రి, నీటిపారుదల, ఎస్పీ ఆఫీస్, డీసీఎస్‌వో, ఎంపీడీవో కోనరావుపేట, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్‌కు రెండు చొప్పున, డీఎంహెచ్‌వో, డీఎండబ్ల్యూవో, చేనేత జౌళి శాఖ, సీఈవో జెడ్పీ, ఫిషరీస్, వేములవాడ మున్సిపల్ కమిషనర్, మైన్స్, ఎంపీడీవో తంగళ్లపల్లి, ఎక్సైజ్‌శాఖకు ఒకటి చొప్పున వచ్చాయి. మొత్తం 115 దరఖాస్తులు వచ్చాయి.

పరిహారం సమంగా ఇప్పించాలి



మాది తంగళ్లపల్లి మండలం చీర్లవంచ. మా మేనత్త సాయమ్మ ఇల్లు ముంపునకు గురైంది. మేనత్తకు నాతోపాటు సోదరుడు రాజయ్య ఇద్దరం వారసులం. దీనికి సంబంధించిన నష్ట పరిహారాన్ని మా ఇద్దరు అన్నదమ్ములకు సమంగా పంచివ్వాలి.

– దుంద్రపెల్లి రవీందర్

మా భూమి ఇప్పించండి



మాది తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్. మానాన్న పేరుతో సర్వేనంబరు 917లో ఎకరం భూమి ఉంది. మా తండ్రి చనిపోయేంత వరకు ఎవరికీ భూమి అమ్మలేదు. గ్రామానికి చెందిన ఒకరు తన పేరుపై 30 గుంటలు అక్రమంగా చేయించుకున్నాడు. సదరు భూమిని మాకు ఇప్పించాలి.

– క్యారం రవి, అంకుసాపూర్

సెస్‌లో అవినీతిపై విచారణ జరపాలి




సెస్ సంస్థలో రూ.94.88కోట్లు అవినీతి జరిగిందని ఈఆర్‌సీ ఆడిట్‌లో తేలింది. దీనికి సంబంధించిన ఫైళ్లను అగ్నిప్రమాదం పేరుతో తగులబెట్టారు. అవినీతిపై నిజాలు తేల్చేలా వెంటనే విచారణ చేపట్టి సంస్థ ఆదాయాన్ని కాపాడాలి. బాధ్యులైన అధికారులు, పాలకవర్గం ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి.

– నాగుల శ్రీనివాస్, సిరిసిల్ల, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

విద్య, వైద్యం హబ్‌గా జగిత్యాల

- ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి
- నియోజకవర్గానికి అత్యధిక నిధులు
- ఏడాదిలోనే ఎంతో చేశా
- అభివృద్ధి కోసమే పార్టీ మారాను
- 'సాక్షి'తో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: 'జగిత్యాలను విద్య, వైద్య హబ్‌గా తీర్చిదిద్దాం. వృత్తిరీత్యా డాక్టర్‌నైనా.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు తెచ్చాను. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాల్లో పాలుపంచుకుంటూ ముందుకెళ్తున్నా. ప్రజలు నాకు రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా..' అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి, నాలుగేళ్లలో చేయాల్సిన ప్రగతిపై 'సాక్షి'కి వివరించారు.



Interview

సాక్షి: ఎమ్మెల్యేగా ఏడాది పూర్తయింది.. ఇప్పటివరకు ఏం చేశారు..?ఇంకా ఏం చేయనున్నారు..?

ఎమ్మెల్యే: జగిత్యాల నియోజకవర్గంలో రూ.240 కోట్లతో ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాల, రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, బీర్‌పూర్‌లో కేజీబీవీ పాఠశాల ఏర్పాటు చేస్తున్నాం. 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు దాదాపు పూర్తికావచ్చాయి. ఇప్పటికే కాంట్రాక్టర్లకు రూ.31 కోట్లు చెల్లించాం. పైప్‌లైన్, వాటర్‌ట్యాంక్‌కు రూ.34 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తాం. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, 50 బెడ్లతో క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తి కావస్తోంది. అన్ని పరీక్షలు ఉచితంగా చేసుకునేలా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశాం. బీర్‌పూర్‌కు పీహెచ్‌సీ మంజూరైంది. నియోజకవర్గం మొత్తంగా 21 పల్లె దవాఖానాలు మంజూరయ్యా యి. ఒక్కో భవనానికి రూ.20లక్షలు మంజూరు చేయించా. త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

సాక్షి: పట్టణంలో డ్రెయినేజీ సిస్టమ్ అస్తవ్యస్తంగా ఉంది. ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎమ్మెల్యే: జగిత్యాలలో అండర్ డ్రెయినేజీ ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. రూ.100 కోట్లకు ప్రతిపాదనలు రూపొందించాం. సీఎం నుంచి లేఖ కూడా వచ్చింది. త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తాం.

సాక్షి: రోడ్ల బాగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎమ్మెల్యే: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు రూ.15 కోట్లు మంజూరు చేయించా. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు ఇప్పటికే వేయించాం. ఉపాధి హామీ పథకం కింద రూ.3 కోట్లు కేటాయించాం.

సాక్షి: యావర్‌రోడ్, రింగ్‌రోడ్‌కు ప్రతిపాదనలు..?

ఎమ్మెల్యే: నేషనల్ హైవే అధికారులు రింగ్‌రోడ్ ఏర్పాటుకు పరిశీలన చేపట్టారు. త్వరలోనే ఏర్పాటు అయ్యేలా చూస్తాం. అలాగే యావర్‌రోడ్ 100 ఫీట్లు వెడల్పుతో 993 మీటర్ల దూరం పూర్తి చేశాం. కొన్ని కోర్టుకేసులతో జాప్యం జరుగుతోంది. త్వరలోనే అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: ఉద్యానవనం పార్కులపై..?

ఎమ్మెల్యే: లింగంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రూ.2 కోట్లతో ఉద్యానవనం ఏర్పాటు చేశాం. అందులో వాకింగ్ ట్రాక్, చెరువులు, జిమ్‌లు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఇది ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. అందరికీ అందుబాటులో చేపట్టాం.

సాక్షి: బల్దియాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఎందుకు మధ్యలోనే ఆగిపోయాయి..?

ఎమ్మెల్యే: మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు తుదిదశలో ఉన్నాయి. వాటి కోసం రూ.25 లక్షలు మంజూరు చేయించాం. త్వరలోనే అవి కూడా పూర్తవుతాయి.

సాక్షి: జిల్లాకేంద్రంలో మాస్టర్ ప్లాన్‌పై..?

ఎమ్మెల్యే: మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రతిపాదనలు చేశాం. రైతుల నుంచి కొంత అసంతృప్తి రావడంతో ప్రతిపాదనలను నిలిపివేశాం. రైతుల సహకారంతో మాస్టర్ ప్లాన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అందరి అనుమతితోనే పూర్తి చేసేలా చూస్తాం.

సాక్షి: రోళ్లవాగు ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

ఎమ్మెల్యే: రోళ్లవాగు దాదాపు పూర్తికావచ్చింది. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. త్వరలోనే 30 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. తాగునీటికి కూడా ఉపయోగపడుతుంది.

సాక్షి: స్కూళ్లలో వసతుల కోసం ఏం చేయనున్నారు?

ఎమ్మెల్యే: జగిత్యాల, ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేటలో అటల్ రికరింగ్ పథకం కింద సైన్స్ ల్యాబ్స్ మంజూరయ్యాయి. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. అలాగే టీఆర్‌నగర్‌లో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ రూ.5 కోట్లతో ఏర్పాటు చేశాం. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

సాక్షి: పార్టీ మార్పుపై..?

ఎమ్మెల్యే: నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరాను. సీఎం రేవంత్‌రెడ్డి జగిత్యాల నియోజకవర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, నిధులు కేటాయిస్తున్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లకు, పెండింగ్‌లో ఉన్న రూ.34 కోట్ల మంజూరుతోపాటు, రూ.30 కోట్లు అదనంగా కేటాయించారు. అలాగే రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.240 కోట్లతో ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్, వైద్య, విద్యకు సంబంధించి ఎన్నో నిధులు తెచ్చాం. అభివృద్ధి కోసమే పార్టీలో చేరాను. రాజకీయాలకతీతంగా పనిచేస్తున్నాను.

మెడికల్ కాలేజీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 65 ఏళ్లలోపు ఉండి, మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్డ్ అయిన ఎంబీబీఎస్ విద్యార్హతలు గల వారు అర్హులు అని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.52వేల నెలవారీ పారితోషికం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తును పూర్తిచేసి కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో ఈనెల 12న జరిగే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



బాబా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లికి చెందిన షేక్ ముస్తాక్ బాబా(18) అనే ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. ముస్తాక్ కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. గతేడాది అతనికి బైక్ యాక్సిడెంట్ అయింది. ఆ సమయంలో కడుపులో దెబ్బ తగిలింది. అప్పటినుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు పేదరికం అడ్డు వచ్చింది. ఈ క్రమంలో తరచూ కడుపు నొప్పి వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాడు. స్థానికంగా వైద్యం చేయించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

బిహార్ కూలీ దుర్మరణం

శంకరపట్నం(మానకొండూర్): రోడ్డు ప్రమాదంలో ఓ బిహార్ కూలీ మృతిచెందినట్లు ఎస్సై రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అమర్ చౌదరి శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులోని గ్రానైట్ క్వారీలో పని చేస్తున్నాడు. అతని సోదరుడు మోహన్‌కుమార్ చౌదరి కూలీ పని కోసం నెల రోజుల క్రితం ఇక్కడికి వచ్చాడు. నాలుగు రోజుల క్రితం గోపాల్‌పూర్‌కు చెందిన వల్లెపు యాదగిరి వద్ద పనికి కుదిరాడు. సోమవారం గోపాల్‌పూర్ నుంచి మోటార్ సైకిల్‌పై కొత్తగట్టులోని సోదరుడి వద్దకు వస్తున్నాడు. గ్రామ శివారులో రోడ్ డైవర్షన్ కోసం ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



సాయి (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లికి చెందిన జంగిటి కిషన్–భాగ్య దంపతులకు కుమారుడు సాయి(18), ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సాయి హార్వెస్టర్ కొనుగోలు చేసి, నడిపిస్తున్నాడు. సోమవారం రాత్రి డ్రైవర్‌ను బైక్‌పై తీసుకెళ్లి, అతని స్వగ్రామం గూడెంలో దింపాడు. తిరిగి వస్తుండగా ఆ గ్రామ శివారులోనే వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై గణేశ్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేరుకున్న చెత్త.. కమ్మేస్తున్న పొగ

- పలు డంపింగ్‌యార్డుల్లో పరిస్థితి
- కాల్చేయడం, మంటలు అంటుకుంటుండటంతో ఇళ్లలోకి పొగ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

సాక్షి పోకస్

గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త.. బయోమైనింగ్‌పై పట్టింపు లేదు.. కొన్నిచోట్ల చెత్తను కాల్చేస్తున్నారు.. ఇంకొన్నిచోట్ల మంటలు చెలరేగి, దట్టమైన పొగ ఇళ్లను కమ్మేస్తుంటే, మరోవైపు దుర్వాసన.. తమకు ఊపిరాడటం లేదని, ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుచోట్ల తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. డంపింగ్‌యార్డుల ఆవరణలో పడేస్తున్నారు. చెత్త రీసైక్లింగ్‌కు నోచుకోక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.

బయోమైనింగ్‌లో జాప్యం



గుట్టను తలపిస్తున్న చెత్త, వెలువడుతున్న పొగ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మానేరు వాగు ఒడ్డున ఉన్న డంపింగ్‌యార్డుతో సమీప డివిజన్లకు చెందిన ప్రజలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని చెత్తను ఏ రోజుకారోజు డంప్‌యార్డుకు తరలిస్తుండటంతో గుట్టలుగా పేరుకుపోయింది. బయోమైనింగ్‌లో విపరీతమైన జాప్యం జరుగుతోంది. అప్పుడప్పుడు డంప్‌యార్డులో మంటలు చెలరేగుతుండటంతో దట్టమైన పొగ ఆటోనగర్, కోతిరాంపూర్, కట్టరాంపూర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, అల్కాపూర్‌కాలనీ, లక్ష్మినగర్, గాయత్రినగర్, కాపువాడ, పోచమ్మవాడ తదితర ప్రాంతాలను కమ్మేస్తోంది. దుర్వాసన వస్తోందని, ఊపిరాడటం లేదని స్థానికులు అంటున్నారు. ఈ యార్డును మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



సిరిసిల్ల యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లను ఏడేళ్లుగా ప్లాస్టిక్ రహిత పట్టణంగా ప్రకటిస్తున్నారు. అయితే, కొన్ని రోజులుగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడంపై బల్దియా దృష్టిసారించడం లేదన్న ఆరోపణలు న్నాయి. ఫలితంగా స్థానిక డంపింగ్‌యార్డులో వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్ రహితం ప్రకటనల్లోనే కానీ అమలు లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సెగ్రిగేషన్ షెడ్డు బయట చెత్త



కాల్వశ్రీరాంపూర్ షెడ్డు బయట పడేసిన చెత్త

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు అలంకారప్రాయంగా మారింది. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇనుప వస్తువులు, పేపర్లను షెడ్డులోని ఒక్కో అరలో భద్రపరిచి, రీసైక్లింగ్ చేయాల్సి ఉంది. కానీ, చెత్తంతా డంపింగ్‌యార్డు బయట పోసి, కాల్చేస్తుండటంతో పొగ వ్యాపిస్తోంది. దీనికి సమీపంలోనే కేజీబీవీ ఉంది. పొగతో ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా తడి, పొడి చెత్త వేరు చేసి, రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించాలని, గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరేలా చూడాలని కోరుతున్నారు.

‘గోవుల సంరక్షణ అందరి బాధ్యత’



రైతులను సన్మానిస్తున్న విజయభాస్కర్, భూమారెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): గోవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి చేపూరి విజయభాస్కర్ అన్నారు. ఆవులను పెంచుతున్న రైతులు మొరపు జలపతి, సాతర్ల రామన్నలను జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డితో కలిసి సోమవారం మల్లాపూర్‌లో సన్మానించారు. పూర్వం దేశంలో ఎక్కడ చూసినా పల్లెలు పశుసంపదతో కళకళలాడేవన్నారు. పశుపోషణ, సేంద్రియ పంటలు పండించి, కల్తీ లేని ఆహారం తింటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సంఘ్ మండల అధ్యక్షుడు కల్లెం మహిపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోచంపల్లి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో యువకుల వీరంగం

- వృద్ధుడితోపాటు, మహిళపై దాడి
- బైక్‌కు నిప్పంటించేందుకు యత్నం

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్ సమీపంలో ఆదివారం రాత్రి కొంతమంది యువకులు వీరంగం సృష్టించారు. రెండు వర్గాలకు చెందినవారు గొడవకు దిగి, కొట్టుకున్నారు. అనంతరం స్థానికుడైన అనుమల్ల హన్మాండ్లు అనే వృద్ధుడి ఇంటికి వెళ్లి, తలుపులు తీయాలని బెదిరించారు. తలుపులు తెరవగానే ఇంట్లోకి వెళ్లి, అతని తలపై కర్రతో బాదారు. ఈ ఘటనలో హన్మాండ్లుకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారిలో వారే గొడవపడి, అక్కడి నుంచి భీమునిదుబ్బ ఏరియాలోని ఓ మహిళ ఇంటికి వెళ్లి, ఆమెను కొట్టారు. అక్కడున్న బైక్‌కు నిప్పంటించేందుకు ప్రయత్నించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో పరారయ్యారు. హన్మాండ్లును స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా అతని తలకు 14 కుట్లు పడినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి, కెనాల్‌లో పడి

- వ్యక్తి మృతి
- మృతుడు గోదావరిఖనివాసి



కిరణ్ మృతదేహం

ఎలిగేడు(పెద్దపల్లి): బైక్ అదుపుతప్పి, కెనాల్‌లో పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన సిరిసిల్ల కిరణ్(37) కరీంనగర్‌లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. గత ఆదివారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని, పని ముగిశాక జూలపల్లి మండలం చీమలపేటలో స్నేహితుడిని కలిసివస్తానని ఇంట్లో చెప్పి, బైక్‌పై అతని మిత్రుడితో వెళ్లాడు. రాత్రి 9 గంటలకు చీమలపేట నుంచి గోదావరిఖని తిరిగి వస్తుండగా రాములపల్లి–నారాయణపూర్ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి, ఎస్సారెస్పీ కెనాల్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతని వెనక కూర్చున్న స్నేహితుడి చేయి విరిగింది. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఏడాది వయసున్న బాబు ఉన్నాడు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవు మృతి



వైద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పశువైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆవు మృతి చెందిందని ఆరోపిస్తూ రైతులు ముస్తాబాద్ పశువైద్యశాల ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఆవు కళేబరాన్ని పశువైద్యశాల ఎదుట వేశారు. రైతు ఎల్లారెడ్డి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డెలివరీకి ఉన్న తన ఆవును కోరుట్ల పశువైద్యకళాశాలకు తీసుకెళ్లానని, అక్కడ వైద్యులు లేకపోవడంతో తిరిగి ముస్తాబాద్‌కు తరలించానన్నారు. సరైన సమయంలో వైద్యసేవలు అందక చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు బీజేపీ నాయకులు మెంగని మహేందర్, బీఆర్‌ఎస్ యువజన మండల అధ్యక్షుడు శీలం స్వామి మద్దతుగా నిలిచారు. ఇన్‌చార్జి వైద్యాధికారి హరిత, ఏడీ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రైతు నాయకులు అల్లం లక్ష్మణ్, కనమేని లింగారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు పక్కన ఆగిపోయిన బస్సు

వేములవాడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. వేములవాడ మండలం అనుపురం శివారులో కరీంనగర్–సిరిసిల్ల రహదారిపై సోమవారం వేములవాడ వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వాటిని తప్పించబోయిన సిరిసిల్ల డిపో ఆర్టీసీ బస్సు పూర్తిగా రోడ్డు పక్కకు వెళ్లి, ఆగిపోయింది. ద్విచక్ర వాహనదారులు వేములవాడకు చెందిన నవీన్ చెతికి గాయమవగా, కరీంనగర్‌కు చెందిన వరుణ్ కాలు విరిగింది. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలసదన్‌కు బాలిక



బాలికను బాలసదన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: తనను తండ్రి, పినతల్లి వేధిస్తున్నారని జగిత్యాల కోర్టులో న్యాయమూర్తిని కలిసేందుకు వెళ్లిన బాలికను పోలీసులు చేరదీసి బాలసదన్‌కు తరలించారు. గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలోని ఇబ్రహీంనగర్‌కు చెందిన బాలిక (14) తనను తండ్రి, పినతల్లి వేధిస్తున్నారని గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరిగి బాలిక మళ్లీ తల్లిదండ్రుల వద్ద ఉండకుండా తనకు న్యాయం చేయాలని కోరడంతో పోలీసులు సోమవారం బాలసదన్‌లో చేర్పించగా కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

మాజీ సర్పంచుల కట్టడి

- హైదరాబాద్‌లో అడ్డుకున్న పోలీసులు



అసెంబ్లీ వద్ద మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సిరిసిల్ల: పెండింగ్‌లు విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచులు సోమవారం తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడిని పోలీసులు కట్టడి చేశారు. వ్యూహాత్మకంగా ముందుగానే హైదరాబాద్‌కు చేరుకున్న మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వ్యాన్‌లో ఎక్కించి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాజీ సర్పంచులు నినాదాలు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధును పోలీసులు నిర్బంధించి సౌత్, వెస్ట్ జోన్ పరిధిలోని షాహినాయత్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల జేఏసీ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడిని పోలీసులు కట్టడి చేశారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సర్వీ యాదయ్యగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్ల మధు, గుంటి మధుసూదన్‌రెడ్డి, నీరటి బాబు, అన్ని జిల్లాల జేఏసీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



పరిశీలిస్తున్న సీఐ ప్రసాదరావు

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వీధికి చెందిన బిల్లా రాజయ్య ఇంట్లో దొంగలు పడి, ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. రాజయ్య గత నెల 27న ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి, హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చాడు. తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, బీరువాలో చూడగా 11 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.30 వేలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, పోలీసుల సమాచారం అందించాడు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు, కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ సోమవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణులతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రణయశ్రీని అభినందిస్తున్న ఎంఈవో, టీచర్లు

ధర్మపురి: ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మపురి కేజీబీవీ విద్యార్థిని ప్రణయశ్రీ ఎంపికైనట్లు ఎంఈవో సీతామహాలక్ష్మి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రణయశ్రీ ఎరువుల తయారీ ప్రాజెక్టు ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. మొత్తం 65 ప్రదర్శనలు రాగా, ఏడింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. వాటిలో తమ విద్యార్థిని ప్రాజెక్టు ఉండటం సంతోషంగా ఉందన్నారు. సోమవారం ఆమెను ప్రిన్సిపాల్ అరుణ, టీచర్లతో కలిసి అభినందించారు.

పౌరసత్వం కేసు.. 15 ఏళ్లకు తీర్పు

- వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు చుక్కెదురు
- తప్పుదోవ పట్టిస్తారా అంటూ హైకోర్టు ఆగ్రహం
- రూ.30 లక్షల జరిమానా
- ఫలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోరాటం

వేములవాడ: 15 ఏళ్లుగా సాగుతున్న వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పౌరసత్వం కేసుపై హైకోర్టు సోమవారం తుది తీర్పు వెల్లడించింది. కోర్టును తప్పుదోవ పట్టించారంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రమేశ్‌బాబు పిటిషన్ డిస్మిస్ చేసి, రూ.30 లక్షల జరిమానా విధించింది. ఇందులో నుంచి ప్రత్యర్థి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి రూ.5 లక్షలు నెల రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

హైకోర్టు, సుప్రీంకోర్టు, కేంద్ర హోంశాఖ..

2009లో రమేశ్‌బాబు టీడీపీ అభ్యర్థిగా వేములవాడలో పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 1,821 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల అఫిడవిట్‌లో తాను ఏడాదిగా ఇండియాలో నివసిస్తున్నట్లు రమేశ్‌బాబు పేర్కొన్నారు. దీన్ని సవాల్ చేస్తూ ఆది శ్రీనివాస్ హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఏడాదిగా స్వదేశంలో ఉన్నట్లు ఆధారాలు చూపించాలని న్యాయస్థానం రమేశ్‌బాబును ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఆయన 96 రోజులే ఇండియాలో ఉన్నారని తేలింది. దీంతో 2013లో హైకోర్టు రమేశ్‌బాబు పౌరసత్వం చెల్లదని తీర్పునిచ్చింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా తీర్పు అమలుపై స్టే విధించింది. విచారణ అనంతరం 2017 ఆగస్టు 31న రమేశ్‌బాబు పౌరసత్వం చెల్లదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.

విచారణలో ఉండగానే నాలుగుసార్లు గెలుపు..

2009లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, గెలుపొందిన రమేశ్‌బాబు 2010లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామా చేసి, మళ్లీ పోటీ చేశారు. టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించారు. పౌరసత్వం కేసు విచారణలో ఉండగానే 2014 సాధారణ ఎన్నికల్లో, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్‌పై నాలుగోసారి గెలిచారు. కేసు విచారణ సమయంలోనే రమేశ్‌బాబు నాలుగు ఎన్నికల్లో విజయం సాధించారు.

న్యాయం గెలిచింది



15 ఏళ్లుగా చెన్నమనేని రమేశ్‌బాబు చేస్తున్న మోసాలు బయటపడ్డాయి. ఆయన జర్మనీబాబు అని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇన్నేళ్లుగా ఆయన ప్రభుత్వాన్ని, కోర్టును, వేములవాడ ప్రజలను మోసం చేస్తూ వచ్చారు. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు హైకోర్టు జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రమేశ్‌బాబు పిటిషన్ డిస్మిస్ చేసి, జరిమానా విధించింది. నా పోరాటం ఫలించింది. రమేశ్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరతాను. నాకు సహకరించిన, నా వెన్నంటి ఉన్న వేములవాడ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

కోర్టు తీర్పు నిరాశపరిచింది



నా పౌరసత్వంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నన్ను నిరాశపరిచింది. ఈ తీర్పు హేతుబద్ధంగా లేదు. 2019లో తెలంగాణ హైకోర్టు పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10.3ని తూచా తప్పకుండా అమలు చేయాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు వస్తాయి. వాటన్నింటినీ తట్టుకొని, ముందుకుపోవడమే ముఖ్యం. నిజాయతీగా పని చేసిన నన్ను వేములవాడ ప్రజలు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రస్తుత తీర్పుపై కోర్టుకెళ్లే అవకాశాన్ని మా న్యాయవాదులు పరిశీలిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత నేను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నాను. భవిష్యత్‌లో కూడా మా ప్రాంత అభివృద్ధికి నా వంతు సహకారం తప్పకుండా ఉంటుంది.

– రమేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, వేములవాడ

ప్రభుత్వ భూమి గుర్తింపు వివాదాస్పదం

- పట్టా భూమి అన్న రైతు
- కాదని, కేసు పెడతామని హెచ్చరించిన అధికారులు

బుగ్గారం(ధర్మపురి): ప్రభుత్వ భూమి గుర్తింపు కోసం రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే వివాదాస్పదమైంది. అది తన పట్టా భూమి అని ఓ రైతు, కాదని, అడ్డొస్తే కేసు పెడతామని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన బుగ్గారం శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అధికారులు సోమవారం బుగ్గారం శివారు సబ్‌స్టేషన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రైతు సతీశ్.. ఇది తమ పట్టా భూమి అని, తాము చాలా ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామని తెలిపాడు. అధికారులు బదులిస్తూ.. ఇది ప్రభుత్వ భూమి, మీది కాదని సతీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పనికి అడ్డొస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, అధికారులు ఇప్పుడొచ్చి, ఇది ప్రభుత్వ భూమి అంటే తమ పరిస్థితి ఏంటని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను ‘సాక్షి’ వివరణ కోరగా.. ప్రభుత్వ భూమి గుర్తింపు కోసం తాము చేసిన సర్వే ఫైనల్ కాదని బదులిచ్చారు. మరింత సమాచారం కోసం అడగగా స్పందించలేదు. గతంలోనూ బుగ్గారం శివారులో ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఇకనైనా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, మండలంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం

- జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

సిరిసిల్ల: జిల్లాలో వంద రోజుల్లో టీబీ(క్షయ) వ్యాధి నిర్మూలన లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వైద్యాధికారులు, వైద్యసిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో వసంతరావు మాట్లాడుతూ నిక్షయ శిబిర్ (వంద రోజుల్లో టీబీ నిర్మూలన)లో భాగంగా రోగులను గుర్తించి, అవగాహన కల్పించాలని సూచించారు. క్షయవ్యాధి గ్రస్తులు తుమ్మినా.. దగ్గినా.. ఉమ్మినా.. వైరస్ గాలిలో కలుస్తుందన్నారు. వంద రోజుల్లో టీబీని నిర్మూలించే లక్ష్యంతో పనిచేయాలని కోరారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు మాట్లాడుతూ డయాబెటిక్, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, కిడ్నీ మార్పిడి అయినవారు, గతంలో క్షయ వచ్చి తగ్గిన వారికి మళ్లీసోకితే.. హైరిస్క్ కేసులుగా గుర్తించాలన్నారు. తెమడతో కూడిన దగ్గు రెండు వారాలకు మించి ఉంటే పరీక్షలు చేయించాలన్నారు. టీబీ సోకిన వారికి పోషకారం కోసం రూ.1000 పారితోషికాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. వైద్యులు దివ్యశ్రీ, నయీమా, డీడీపీ పీఎం డెమో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజన్నకు తలనీలాలు, కోడెమొక్కులు



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

వేములవాడ: వేములవాడ రాజన్న దర్శించుకునేందుకు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానం చేసి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకొని, నిలువెత్తు బంగారం పంపిణీ చేశారు. అనుబంధ దేవాలయాల్లో పూజలు చేశారు. సుమారు 30 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు. ఆలయానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి గీతాజయంతి ఉత్సవాలు

రాజన్న సన్నిధిలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు గీతా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు జరుపుతామన్నారు. నాగిరెడ్డి మండపంలో గీతాహోమం, గీతా ప్రవచనాలు ఉంటాయని, అనుబంధ దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 12న ఉదయం 11.15 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.



కోడెమొక్కు చెల్లిస్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



న్యాక్ బృందం సందర్శన

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం న్యాక్ బృందం సందర్శించింది. కళాశాలలో వసతులు, బోధనా పద్ధతులను పరిశీలించారు.



నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలినా ఆల్ఫ్రెడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
ఉదయం మంచు కురుస్తుంది.
చలి తీవ్రత ఉంటుంది.

అసైన్డ్ భూములపై ఆరా

- గత ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపులపై విచారణ
- 300 ఎకరాల అక్రమ పట్టాల గుర్తింపు
- ప్రభుత్వానికి నివేదిక.. చర్యలకు సిఫార్సులు
- బీఆర్ఎస్ నేతలకు బిగుస్తున్న ఉచ్చు

జిల్లాలో భూముల వివరాలు

గ్రామాలు	260
మండలాలు	13
రెవెన్యూ గ్రామాలు	171
సర్వే నంబర్లు	91,416
భూములు	4,68,532 ఎకరాలు

జిల్లాలో కేటాయించిన అసైన్డ్ భూములు: గోప్యంగా ఉంచారు



పెద్దూరు శివారులోని అసైన్డ్ భూములు

సిరిసిల్ల: పేదల పేరిట పెద్దలకు పట్టాలిచ్చిన అసైన్డ్ భూములపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆరా తీస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతలకు ప్రభుత్వ భూములను పట్టా లుగా కట్టబెట్టిన తీరుపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నేతృత్వంలో ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300 ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా అధికార పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లినట్లు యంత్రాంగం గుర్తించింది. ఈ మేరకు అర్హత లేకున్నా.. పట్టాలు పొందిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలా..? పాత రెవెన్యూ చట్ట నిబంధనల మేరకు ఆ భూములను వెనక్కి తీసుకోవాలా..? ధరణి పోర్టల్ రద్దు అవుతున్న నేపథ్యంలో కొత్త రెవెన్యూ చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలా..? అనే అంశాలపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సమాచారం.

భూకబ్జా కేసులో బీఆర్ఆర్ నేత జైలుకు..

సిరిసిల్ల పట్టణ శివారులోని సర్ధాపూర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ నేత బొల్లి రామ్మోహన్‌ను నవంబరు 30న పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ కేసులో ఇంకా కొంత మంది నిందితులుగా ఉన్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో అదర్స్‌గా పేర్కొన్నారు. ప్రభుత్వ భూకబ్జాకు సంబంధించి ఎన్‌వోసీ జారీ చేసిన తహసీల్దార్, రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, అక్కడి భూమిని పొందిన ఇతరులపైనా కేసులు నమోదవుతాయని భావిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ భూకబ్జా కేసుల్లో పట్టాలు పొందిన వ్యక్తికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి, ఆ భూమిని వెనక్కి తీసుకోవచ్చు. నోటీసు తీసుకోకుండా సదరు వ్యక్తి తిరగబడితే పోలీసు కేసు నమోదు చేయవచ్చు. కానీ అలాంటిది ఏమీ లేకుండానే నేరుగా పోలీసు కేసు నమోదు చేసి రామ్మోహన్‌ను జైలుకు పంపించారు. బీఆర్ఎస్ నేతలుగా ఉన్నందుకే తమపై కక్ష సాధింపుగా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని నాయకులు పేర్కొంటున్నారు.

అసైన్డ్ భూముల కేటాయింపులపై..

2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్లుగా సిరిసిల్ల, వేములవాడ ఎమ్మెల్యేలు కేటీఆర్, చెన్నమనేని రమేశ్‌బాబు సిఫార్సుల మేరకు ఎవరెవరికి ఏ ఊరిలో ప్రభుత్వ భూమిని కేటాయించారు..? పట్టా పొందిన వ్యక్తి ఇప్పుడు కబ్జాలో ఉన్నారా..? తదితర వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములకు పట్టాలు పొందిన వ్యక్తి పేదవాడైతే, అర్హత ఉంటే వారిపై కేసులు ఉండవని, అధికారుల అండతో ప్రభుత్వ భూమిని చెర పట్టిన వారు చెరశాలకు వెళ్లాల్సిందేనని ప్రస్తుత అధికార పార్టీ నేత ఒకరు చెప్పడం కొసమెరుపు.



ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ భూముల్లో పంటల సాగు

దళిత మహిళలకు కేటాయింపులపై..

జిల్లాలో భూ కొనుగోలు పథకం(ఎల్‌పీఎస్)లో భూమి లేని పేద దళిత మహిళలకు 2014 నుంచి 2021 వరకు 165 మందికి 436.02 ఎకరాలు కేటాయించారు. వాస్తవానికి పట్టాలు పొందిన దళిత మహిళలు ఆ భూములను సాగు చేసుకుంటున్నారా..? వారు అర్హులేనా.. అనే అంశాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

నోరువిప్పని రెవెన్యూ అధికారులు

అసైన్డ్ భూములపై అధికారులు ఆరా తీయడంతో రెవెన్యూ అధికారులను 'సాక్షి' సంప్రదిస్తే నోరు విప్పడం లేదు. 'అంతా పెద్ద సారే చూసుకుంటున్నారు' అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల కేటాయింపుల వివరాలు అడిగితే తమను ఏమీ అడగొద్దని, ఏమీ తెలియదని అధికారులు దాటవేత ధోరణిని అనుసరించడం గమనార్హం. ఓ అధికారి అయితే.. ఏకంగా ఈ భూముల లొల్లి ఏమిటీ అని లీవులో వెళ్లినట్లు పేర్కొనడం విశేషం.

ఇప్పటికే గుర్తించినవి కొన్ని..

- సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు, సర్ధాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల శివారుల్లోని ప్రభుత్వ భూములకు కొందరు బీఆర్ఎస్ నేతలు పట్టాలు పొందినట్లు సమాచారం.
- పట్టణానికి చెందిన ఓ ముఖ్యనాయకుడి తమ్ముడి పేరిట రెండెకరాల భూమికి పట్టా పొంది, ఇటీవలే దాన్ని మళ్లీ రద్దు చేసుకున్నట్లు తెలిసింది.
- ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ ఏడెకరాలు, ఓ మాజీ జెడ్పీటీసీ ఐదెకరాలు పొందినట్లు గుర్తించారు.
- ముస్తాబాద్ మండలంలోనూ అనర్హులకు భూములు కేటాయించినట్లు గుర్తించారు.
- సిరిసిల్ల పట్టణానికి, తంగళ్లపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొందరు తలా రెండుమూడెకరాలకు పట్టాలు తీసుకున్నట్లు గుర్తించారు. అప్పట్లోనే ఎకరానికి రూ.5 లక్షలు ఖర్చుల పేరిట బీఆర్ఎస్ నాయకుడు ఒకరు వసూలు చేసి, రెవెన్యూ ఉన్నతాధికారులకు సమర్పించి భారీ ఎత్తున ప్రభుత్వ భూమిని పట్టాలుగా పొందినట్లు సమాచారం. అప్పట్లో పట్టాలు పొందిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రామ్మోహన్ అరెస్ట్‌తో ఆందోళనకు గురవుతున్నారు.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి రాధికా జైస్వాల్

వీర్నపల్లి(సిరిసిల్ల): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని, హక్కుల పరిరక్షణకు ప్రయత్నించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సీనియర్ సివిల్ కార్యదర్శి రాధికా జైస్వాల్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. పోక్సో, రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్‌లపై అవగాహన ఉండాలని, బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. న్యాయపరమైన విషయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి.పరశురాములు, ఎస్సై ఎల్లయ్య గౌడ్, ఎంఈవో తుమ్మ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో తేడా వస్తే చర్యలు



సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి తదితరులు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఉపాధి హామీ పనుల నిర్వహణలో తేడాలు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 14వ విడత ఉపాధి పనుల సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల నివేదికలు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీడీవో శశికళ, సహాయక విజిలెన్స్ అధికారి రామారావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి నవీన్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవాలి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు వెంటనే పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల జీతం చెల్లిస్తామని అధికారంలోకి వచ్చి ఏడాదిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు మెస్‌చార్జీలు పెంచాలని, నిత్యవసర సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, నరసవ్వ, రాజవ్వ, సరోజన, విజయ, రేణుక, రాజేశ్వరి, రోజా, సునీత, మల్లవ్వ, ఎల్లవ్వ, సుజాత, జుబేదా జయిత్తు, అనిత, లక్ష్మి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా వ్యవసాయ గణన



సమావేశంలో అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో ఈనెల 31లోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, డెప్యూటీ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేయబడిన 50 గ్రామాల్లో మండల వ్యవసాయాధికారులు సెన్సెస్ చార్జి ఆఫీసర్లు ఉంటారని, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్యుమరేటర్లుగా, సూపర్‌వైజర్లుగా ఎంపీఎస్‌వోలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ గణన ఫేజ్-3లో ఎంపిక చేయబడిన 21 గ్రామాల్లో సర్వే చేయాలన్నారు. సమగ్ర సమాచారాన్ని నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(రామగుండం): ఇంటర్మీడియెట్ బోర్డు సూచించిన యాక్షన్‌ప్లాన్ ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి వై.శ్రీనివాస్ సూచించారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమంతప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. సైన్స్ విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాసరవేణి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



సమావేశంలో శ్రీనివాస్‌రావు తదితరులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని జిల్లా ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయంలో మంగళవారం కళాకారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలన్నారు. అన్ని జిల్లాల నుంచి కళాకారులు హాజరుకావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వారాల దేవయ్య, కళాతపస్వి యెల్లా పోశెట్టి, జ్యోతిరెడ్డి, జానకిరెడ్డి, కొండ స్వామి, లక్ష్మీరాజం, శంకరయ్య ఉన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ



క్రీడాకారులతో చైర్‌పర్సన్ కళ తదితరులు

సిరిసిల్లటౌన్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో జీవితంలో ముందుకు సాగాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ లెవెల్ సీఎం కప్-2024 క్రీడల పోటీలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములను సాధారణంగా భావించి గెలిచినవారు రాబోయే కాలంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని, భవిష్యత్తులో మన ప్రాంతానికి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏఎంసీ చైర్మన్ వెలుముల స్వరూపరెడ్డి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవత ప్రభాకర్, తిరుపతి, జగన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జంక్షన్ డిజైన్ మార్చాలి



పనులు పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

వేములవాడ: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ డిజైన్ మార్పు చేసి అహ్లాదకరమైన జంక్షన్ ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ విగ్రహ జేఏసీ, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రారంభమైన జంక్షన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ డిజైన్ కోసం ప్రజాసంఘాల అభిప్రాయాన్ని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సేకరించాలని విజ్ఞప్తి చేశారు. గార్డెన్ సెంటర్ పాయింట్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందు, గోలి మహేశ్, నాయకులు దుమ్మ ఆనంద్, సంటి అంజిబాబు, గుండా థామస్, మూలే కిషోర్, బొడ్డు రాములు, జక్కుల యాదగిరి, జింక శ్రీధర్, సిరిగిరి శ్రీకాంత్, పిట్టల సతీశ్, లింగంపల్లి కిరణ్, గుడిసె మనోజ్‌కుమార్, వంకాయల మహేశ్వర్, తాళ్లపల్లి నాగరాజ్, బొజ్జ చంద్రమోహన్, చర్ల రమేశ్, చర్ల బాలు, వేణుగోపాల్, గుడిసె అరుణ్, అమర్, జింక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్లటౌన్: తమ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు విధులకు హాజరుకాకుండా మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు కల్పించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పదవి విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. సంఘం ప్రతినిధులు ఇప్పపూల దేవయ్య, కత్తి జయలక్ష్మి, రాజు, రాజేందర్, భవాని, నీరజ, సలీం, నరేందర్, శ్రీనివాస్, పద్మ, జ్యోతి పాల్గొన్నారు.



అరెస్టు అప్రజాస్వామికం

సిరిసిల్ల రాణాలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

సిరిసిల్లటౌన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్ వెళ్తున్న ఆశాల ను ప్రభుత్వం ఎక్కడికక్కడ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు రూ.18వేలు వేతనం అందించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వలె కాంగ్రెస్ సర్కారు సైతం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, అన్నల్దాస్ గణేశ్, చంద్రకళ, లావణ్య, ఆశావర్కర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలపండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12 లోపు తెలపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అఖిల పక్ష నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 17న తుది పోలింగ్ కేంద్రాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, 2,268 వార్డులు ఉన్నాయని, ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశామన్నారు. ఈనెల 13న అభ్యంతరాలను ఎంపీడీవో పరిశీలించి తుది నివేదిక అందించాలని, 16న కలెక్టర్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని 17న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీవోల ద్వారా తుది పోలింగ్ కేంద్రాల జాబితా వెల్లడిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లు గుర్తించాలి

ప్రభుత్వ నిర్మాణాలు, స్థానిక, వాణిజ్య అవసరాలకు ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో మాట్లాడారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లపై ఆరా తీశారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.100 ఉండగా, రూ.160 పెంచాలని కమిటీ ప్రతిపాదనలు చేశారు. నిబంధనల మేరకు ఇసుక రవాణాకు అనుమతించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతికుమార్, డీటీవో లక్ష్మణ్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్‌రెడ్డి, సర్వే ఏడీ వినయ్‌కుమార్, భగీరథ ఈఈ జానకి పాల్గొన్నారు.

15లోగా ఇవ్వాలి

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఈనెల 15లోగా ఇవ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో సీఎమ్మార్‌పై అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. జిల్లాలోని కొందరు బాయిల్డ్, రా రైస్ మిల్లర్ల నుంచి గత ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ ఇంకా పెండింగ్ ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచమని పేర్కొన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్ ధాన్యాన్ని తమ మిల్లుల్లో దించుకున్న యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని ఆదేశించారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.రజిత, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పశువైద్యంపై పట్టింపేది?



తెరుచుకోని పోతుగల్ ఉపకేంద్రం

జిల్లాలో పశుసంపద ఇలా..

గేదెలు	1.12లక్షలు
గొర్రెలు	3.10లక్షలు
మేకలు	74వేలు
కోళ్లు బాయిలర్	23లక్షలు
కోళ్లు లేయర్	7లక్షలు
దేశి కోళ్లు	1.10 లక్షలు
కుక్కలు	11వేలు

- జిల్లాలో ఖాళీగా పశువైద్యాధికారుల పోస్టులు
- 82 పోస్టులకు 41 మంది ఉద్యోగులు
- పత్తాలేని పారామెడికల్ సిబ్బంది

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో పశువైద్యంపై పట్టింపు లేకుండా పోయింది. వ్యాధులబారిన పడిన పశువులు విలవిల్లాడుతున్నాయి. సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నాయి. రైతులకు వ్యవసాయం తర్వాత పశుపోషణ ఉపాధిగా నిలుస్తుంది. అయితే పశువైద్యులు లేక అత్యవసర పరిస్థితుల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

అంతటా ఖాళీలు

వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, చందుర్తి, మానాలతోపాటు సిరిసిల్ల నియోజకవర్గంలో ముస్తాబాద్ పశువైద్యశాలల్లో అధికారులు లేరు. జిల్లాలో 13 పశువైద్యశాలలు ఉండగా జూనియర్ వెటర్నరీ అధికారుల పోస్టులు 7 ఖాళీగా ఉన్నాయి. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు 9 ఉండగా ఆరు ఖాళీలు ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 11 ఉండగా 6 ఖాళీగా ఉన్నాయి. 255 గ్రామాలకు 20 మంది మాత్రమే గోపాలమిత్రలు ఉన్నారు. 32 ఆఫీస్ సబార్డినేట్స్‌కు 11 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలో 82 మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 41 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యకేంద్రాలు

జిల్లా కేంద్రంతో సహా మండలాల్లోని పశువైద్యశాలలు 90 శాతం వరకు శిథిలావస్థలో ఉన్నాయి. ఒకవైపు సిబ్బంది కొరతతో సతమతమవుతుండగా, ఇంకోవైపు వైద్యశాలలు సరిగ్గా లేవు. పశువైద్యశాలల్లోను కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. వీటికితోడు పశువులకు టీకాలు ఇచ్చే స్టాండ్స్ కరువయ్యాయి. గొర్రెలు, గేదెలకు నట్టలమందు, గాలికుంటు వ్యాధులకు మాత్రమే మందులు అందజేస్తున్నారు.



వీరు ముస్తాబాద్ మండల కేంద్రంలోని పశువైద్యశాల ఎదుట మృతిచెందిన ఆవు కళేబరంతో ఆందోళన చేస్తున్న రైతులు. ముస్తాబాద్‌కు చెందిన రైతు బొమ్మెల్ల ఎల్లారెడ్డి ఆవు ఈనె దశకొచ్చింది. ఈక్రమంలోనే రైతు ముస్తాబాద్ పశువైద్యశాలకు వెళ్లగా.. వైద్యాధికారి లేకపోవడంతో గోపాలమిత్రను సంప్రదించాడు. కడుపులో దూడ అడ్డం తిరిగినట్లు గుర్తించిన గోపాలమిత్ర ఆపరేషన్ చేయాలని సూచించాడు. ముస్తాబాద్‌లో ప్రస్తుతం పశువైద్యాధికారి లేకపోవడంతో ప్రత్యేక ఆటోలో కోరుట్ల పశువైద్య కళాశాలకు తరలించాడు. అక్కడ వైద్యులు లేకపోవడంతో ముస్తాబాద్‌కు తిరిగొచ్చాడు. ఇక్కడ ఆవు చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో రైతు ఎల్లారెడ్డి, రైతులు ముస్తాబాద్ పశువైద్యశాల ఎదుట ఆవు కళేబరంతో ధర్నాకు దిగారు. ఈ ఘటనతో జిల్లాలో పశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొందని అర్థమవుతోంది.

ఏడాదిగా ఆస్పత్రి తెరుచుకోలేదు



పోతుగల్‌లోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. దీంతో పనిచేసే సిబ్బంది ఎవరూ రావడం లేదు. ఏడాదిగా పశువైద్యశాల తెరుచుకోలేదు. కొత్త ఆస్పత్రి నిర్మించి, సేవలు పెంచాలి.

– తన్నీరు గౌతంరావు, మాజీ సర్పంచ్, పోతుగల్

ప్రతిపాదనలు చేశాం

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతోపాటు పశువైద్యశాలలో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు చేశాం. ప్రభుత్వ విప్ ద్వారా పశువులకు స్టాండ్స్ నిర్మిస్తున్నాం. మందుల కొరత లేకుండా చూస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి